క్లుప్తంగా

'సమస్యలు పరిష్కరించాలి'



ఉప తహసీల్దార్ రామచంద్రరావుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కవిటి: మండలంలోని రేషన్ సరుకులను లబ్ధిదారులకు అందిస్తున్న క్రమంలో ఎదురవుతున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మండల ఎండీయూ ఆపరేటర్ల సంఘం కోరింది. ఈ మేరకు ఉప తహసీల్దార్ పడాల రామచంద్రరావుకు తమ సమస్యలను వివరిస్తూ శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఐదు నెలలుగా తమకు పేపర్ రోల్స్ ఇవ్వడం లేదని, చేతిలో డబ్బులు వెచ్చించి వీటిని కొనుగోలు చేస్తున్నామని పేర్కొన్నారు. సర్వర్ సమస్యలు నానాటికీ అధికమవుతున్న నేపథ్యంలో సకాలంలో లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేయలేకపోతున్నామన్నారు. వీటిపై క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించి వాస్తవాలు గుర్తించాలన్నారు.

కిడ్నీ బాధితుడికి పింఛన్ అందజేత



పింఛన్ అందజేస్తున్న రాఘవరావు తదితరులు

టెక్కలి: మండలంలోని లింగాలవలస పంచాయతీ సార్లిగాం గ్రామానికి చెందిన కిడ్నీ వ్యాధి బాధితుడు సంపతిరావు వీరన్నకు కొత్తగా మంజూరైన డయాలసిస్ పింఛన్ రూ.10 వేలు మాజీ ఎంపీపీ సంపతిరావు రాఘవరావు చేతులమీదుగా శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు ఎస్.గాయత్రి, ఉప సర్పంచ్ ఎస్.ఉమాపతి, పంచాయతీ కార్యదర్శి మురళి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పరిశీలన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ వెంకటరమణ తదితరులు

కోటబొమ్మాళి: స్థానిక అనుపమ సినిమా థియేటర్ భవనంలో తాత్కాలికంగా నిర్వహిస్తున్న మహాత్మా జ్యోతీరావ్‌పూలే హైస్కూల్‌ను జెడ్పీటీసీ దుబ్బ వెంకటరమణారావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వసతులు, మెనూపై ఆరా తీశారు. పాఠశాలలో లైట్లు, ఫ్యాన్లు తగినన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే కాంట్రాక్టర్ వారం రోజులకు సరిపడా కూరగాయలను ఒకేసారి తీసుకొచ్చి నిల్వ చేయడంపై ఎంఈవో–1 అప్పలరాజు అభ్యంతరం వ్యక్తం చేశారు. కూరగాయలను ప్రతిరోజూ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌కు ఆదేశించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రోణంకి మల్లయ్య, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.హేమసుందరరాజు, ఎంఈవో–2 ఎల్వీ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి విరాళం



ప్రిన్సిపాల్‌కు విరాళం అందజేస్తున్న అధ్యాపకులు

టెక్కలి రూరల్: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లినటువంటి ఇద్దరు అధ్యాపకులు కళాశాల అభివృద్ధికి తమ వంతు సాయం అందజేశారు. కళాశాలలో కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులుగా పనిచేసిన ఎం.బాలకృష్ణ, డా.ఎ.శివప్రసాద్‌లు ఇటీవల విశాఖపట్నం బదిలీ అయిన నేపథ్యంలో కళాశాల అభివృద్ధికి రూ.10 వేలు విరాళంగా ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మకు అందజేశారు.

'రుణాలను సద్వినియోగం చేసుకోవాలి'



మాట్లాడుతున్న ఏపీఎం మల్లేశ్వరరావు

పలాస: ప్రభుత్వం ఇచ్చిన రుణాలను మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం బి.మల్లేశ్వరరావు సూచించారు. స్థానిక మండల సమాఖ్య భవనంలో డ్వాక్రా సంఘాల ఆర్గనైజర్లకు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా స్వయంశక్తి సంఘాలు, మండల సమాఖ్యలు ఆర్థిక నిర్వహణ పాలసీ ప్రకారం 5 రకాల విధానాలను అమలు చేయాలని వివరించారు. రుణాలు ఎలా పొందాలి, ఎలా నిర్వహించాలి, చెల్లింపులు, డాక్యుమెంట్లు తయారు చేయడం, ఆన్‌లైన్‌లో నమోదు చేయడం వంటి అంశాల గురించి వివరించారు. ఆర్థిక నియంత్రణ ఉండాలని, ప్రతీ మూడు నెలలకు ఆడిట్ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో సీసీలు మల్లేశ్వరరావు, వెంకటరమణ, నాగమ్మ, రేణుక, అప్పలనరసమ్మ, కల్యాణి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణతో ఆరోగ్యం



ఇచ్ఛాపురం రూరల్: మండపల్లి గ్రామంలో పోషణ కిట్ల పంపిణీ చేస్తున్న దృశ్యం



టెక్కలి: చల్లపేట గ్రామంలో...



మందస: మూలిపాడు గ్రామంలో...

కవిటి: వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా లబ్ధిదారులు ప్రభుత్వం అందజేస్తున్న కిట్లతో ఆరోగ్యవంతంగా ఉంటారని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని ఆర్.భైరిపురం, పెద్ద జల్లుపుట్టుగ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సమగ్ర పోషణ కిట్లను శుక్రవారం అందజేశారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

టెక్కలి: అంగన్‌వాడీ కేంద్రాలు ద్వారా గర్భిణులు, బాలింతలకు ఇంటి వద్దకే పౌష్టికాహారం అందజేసే విధంగా ప్రభుత్వం టేక్ హోమ్ రేషన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని బొప్పాయిపురం సర్పంచ్ జి.మోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక గ్రామ సచివాలయం పరిధి చల్లపేట గ్రామంలో గర్భిణులకు పౌష్టికాహారం కిట్లను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి.రవికుమార్‌రెడ్డితో పాటు అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామ సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మందస: మండలంలోని మూలిపాడులో సంపూర్ణ పోషణ కిట్లు శుక్రవారం పంపిణీత చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గుసిరి వెంకటరావు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్నారుల చెంతకే అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం అందజేస్తోందని పలువురు అన్నారు. అంగన్‌వాడీల ద్వారా టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని భావనపాడు, నౌపడ, మరువాడ గ్రామాల్లో శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బి.మోహన్‌రెడ్డి, పి.బృందాదేవి, ఎస్.ధనలక్ష్మి, ఎస్.రాజారావు, పీఏసీఎస్ డైరెక్టర్ రవికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని మండపల్లి అంగన్‌వాడీ సెక్టారులో సర్పంచ్ పిట్ట శేషమ్మ వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



కవిటి: పెద్దజల్లుపుట్టుగ గ్రామంలో...



కవిటి: ఆర్.భైరిపురం గ్రామంలో...



సంతబొమ్మాళి: మరువాడ గ్రామంలో...

'మారుమూల పల్లెలకూ బస్సు సౌకర్యం'



బస్సు టికెట్ తీసుకుంటున్న సీదిరి శ్రీదేవి

వజ్రపుకొత్తూరు రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మారుమూల పల్లెలకు సైతం బస్సు సౌకర్యాలు అందుబాటులోకి వస్తున్నాయని మంత్రి సీదిరి అప్పలరాజు సతీమణి సీదిరి శ్రీదేవి అన్నారు. మండలంలోని చీపురపల్లి పంచాయతీ పరిధిలో కొండపల్లి నుంచి అక్కుపల్లి మీదుగా పలాస వరకు వెళ్లే ఆర్టీసీ బస్సును శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలానికి శివారు గ్రామాలు కావడంతో ఏళ్ల తరబడి బస్సు సౌకర్యం లేక ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడేవారన్నారు. కొంతమంది ప్రయాణికులు నడిచి, మరి కొంతమంది ఆటోలతో ప్రయాణాలు చేసేవారని పేర్కొన్నారు. దీంతో పరిసర ఉద్దాన, తీరప్రాంత గ్రామాల ప్రజల కోసం బస్సు సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. అనంతరం మంత్రి సతీమణి బస్సు టికెట్ కొనుక్కొని స్థానికులతో ప్రయాణం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసరి పాపారావు, వైస్ సర్పంచ్ మద్దు జశ్వంత్, పలాస ఆర్టీసీ డిపో మేనేజర్ ఆర్.సీతారాం నాయుడు, అసిస్టెంట్ మేనేజర్ పి.సంతోష్, వైఎస్సార్ సీపీ నాయకులు కర్రి తిరుపతిరావు, యంపల్ల కామేష్, దాసరి సుధ, ఎస్.సాగర్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందితో సమీక్ష



రికార్డులు పరిశీలిస్తున్న దువ్వాడ వాణి

కోటబొమ్మాళి: స్థానిక మేజర్ పంచాయతీ సచివాలయ సిబ్బందితో వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి శుక్రవారం సమీక్ష చేపట్టారు. సచివాలయంలో ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. వైద్యం, రైతు భరోసా, సామాజిక పింఛన్లు, గృహ నిర్మాణంపై సిబ్బందితో శాఖలవారీగా మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చిన వినతులపై తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోయిన నాగేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బాడాన మురళి, పంచాయతీ ఈవో చింతాడ శ్రీనివాసరావు, వీఆర్వో పి.అఖిల్ పాల్గొన్నారు.

'సంత భూముల అన్యాక్రాంతాన్ని ఆపండి'



ఎమ్మెల్సీ నర్తు రామారావుకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ దేవదాస్ రెడ్డి తదితరులు

కవిటి: మండలంలోని అంపురం పరిసరాల్లో నిర్వహిస్తున్న ఆదివారం సంత మార్కెట్ స్థలం భూములు అన్యాక్రాంతం కాకుండా ఆపాలని ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి కోరారు. ఈ మేరకు కొత్తపుట్టుగలో ఎమ్మెల్సీ నర్తు రామారావును ఎంపీపీ నేతృత్వంలో మండల సర్పంచ్‌ల సంఘం సభ్యులు శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పేదలు, రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా 40 సంవత్సరాల నుంచి ఎటువంటి పన్నులు వసూలు చేయకుండానే సంత నిర్వహించడం జరిగిందన్నారు. తర్వాత కాలంలో కంచిలి, అంపురం, కత్తివరం, శ్రీరాంపురం గ్రామాలకు చెందిన దాతల సాయంతో అంపురం పంచాయతీ ఎస్ఎంపురం పరిధిలో స్థలాన్ని కొనుగోలు చేసి సంత కోసం కేటాయించడం జరిగిందన్నారు. దీనిపై పలుమార్లు న్యాయస్థానాల్లో కేసులు నమోదవ్వగా, అన్ని తీర్పుల్లోనూ సంత ప్రయోజనాలు కాపాడేవిధంగానే తీర్పు వచ్చిందని పేర్కొన్నారు. కానీ శ్రీరాంపురం గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు దీనిపై అనవసర రాద్ధాంతం చేసి, సంత స్థలాన్ని సొంతం చేసుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టి ప్రజలు, రైతులకు మేలు చేయాలని కోరారు.

మంత్రి బుగ్గనను కలిసిన ఎమ్మెల్సీ నర్తు



మంత్రి బుగ్గనతో ఎమ్మెల్సీ నర్తు రామారావు

కంచిలి: జిల్లా కేంద్రం శ్రీకాకుళంలోని నూతన కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను పరిశీలించడానికి విచ్చేసిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌ని ఎమ్మెల్సీ నర్తు రామారావు శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు. అనంతరం నియోజకవర్గ సమస్యలు గురించి చర్చించారు. అదేవిధంగా సీడాప్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్ రెడ్డి సైతం బుగ్గనను కలిశారు.

ఏవోగా శ్రీనివాస్‌రెడ్డి



కవిటి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా కె.శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన జి.జయంత్‌ప్రసాద్ పదోన్నతిపై ఎంపీడీవోగా పార్వతీపురం మన్యం జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో ఆయన స్థానంలో ఇచ్ఛాపురం డివిజన్ పీఆర్ఐ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డిని పదోన్నతిపై ఏవోగా నియమిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

పరామర్శ



లోకేష్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న విజయ

సోంపేట: మండలంలోని ఇస్కలపాలేం గ్రామానికి చెందిన మత్స్యకారుడు కోనేరు లోకేష్ ఇటీవల చెన్నైలో అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. దీంతో మత్స్యకారుని కుటుంబాన్ని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ శుక్రవారం పరామర్శించారు. కుటుంబాన్ని ఆదుకోవడానికి కృషి చేస్తామన్నారు. మృతిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టేలా చూస్తామన్నారు. ఆమెతో పాటు బైపల్లి తిరుపతి, బైపల్లి దశరథ, బైపల్లి అప్పన్న తదితరులు ఉన్నారు.

సర్వసభ్య సమావేశం నేడు

కవిటి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ కడియాల పద్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.సూర్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అన్నిశాఖల అధికారులు పూర్తి సమాచారంతో విధిగా హాజరవ్వాలని సూచించారు.

మలేరియాపై ముందస్తు జాగ్రత్త చర్యలు



చీపిలో ఫాగింగ్ చేయిస్తున్న అధికారులు

మందస: గిరిజన గ్రామాల్లో మలేరియా ప్రబలకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల రెండు మలేరియా కేసులు గుర్తించడంతో ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు ఆధ్వర్యంలో గిరిజన గ్రామాల్లో పర్యటించి, సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేస్తున్నారు. దీనిలో భాగంగా ఆయా ప్రాంతాల్లో బ్లీచింగ్, క్లోరినేషన్, దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయిస్తున్నారు. వర్షాకాలం కావడంతో గిరిజనులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అదేవిధంగా వైద్య సిబ్బందితో సమావేశాలు ఏర్పాటు చేసి, గిరిజన గ్రామాల్లో పూర్తిస్థాయిలో సేవలు అందించాలన్నారు. జ్వరాలు గుర్తిస్తే తక్షణమే అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమాల్లో ఈవోపీఆర్డీ జయప్రకాశ్, పంచాయతీ కార్యదర్శి మజ్జి సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీని సుందరంగా తీర్చుదిద్దుతాం



రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న చైర్మన్ గిరిబాబు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని జంట పట్టణాలను సర్వాంగ సుందరంగా తీర్చుదిద్దుతామని మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు అన్నారు. మున్సిపాలిటీలోని 6వ వార్డు పరిధిలో చినబడం నుంచి అంతరకుడ్డ వరకు బీటీ రోడ్డు, సీసీ కాలువ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జంట పట్టణాల్లో అవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తున్నామన్నారు. అంతరకుడ్డ గ్రామాన్ని గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని, రాకపోకలకు ఇబ్బందులు కలగడంతో తారురోడ్డు ఏర్పాటుకు, అవసరమైన సీసీ కాలువకు రూ.1.10 కోట్లు కేటాయించామని తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతు వెంకటరావు దొర, వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, సీహెచ్‌సీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, దువ్వాడ రమణరావు, సవర సోమేశ్వరరావు, కొర్రాయి గిరి, ముడిమించి జోగారావు, డబ్బీరు నాగు తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత భూహక్కుపై సర్వే వేగవంతం



మాట్లాడుతున్న డీఎల్‌పీవో రమణ

టెక్కలి: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకానికి సంబంధించిన సర్వేను వేగవంతం చేయాలని టెక్కలి డీఎల్‌పీవో ఐ.వి.రమణ సూచించారు. స్థానిక డీఎల్‌పీవో కార్యాలయంలో డివిజన్ పరిధిలోని పంచాయతీ అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా చేపట్టాలని సూచించారు. అలాగే ఇంటి పన్ను వసూళ్ల వేగవంతం చేయాలన్నారు. ప్రియా సాఫ్ట్‌వేర్‌లో అవసరమైన పంచాయతీ అంశాలను నమోదు చేయాలని పేర్కొన్నారు. స్వామిత్ర సర్వేను పక్కాగా నిర్వహించాలని స్పష్టం చేశారు. వీటితో పాటు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గుర్తించిన పంచాయతీ సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా చూడాలని సూచించారు. సమావేశంలో డీపీఆర్‌సీలు పి.ఆనంద్, మోహిద్దిన్‌ఖాన్, కార్యాలయం ఏవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'అమృత్ భారత్'లో చేర్చడంపై హర్షం

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్‌ను అమృత్ భారత్ స్కీమ్‌లో చేర్చడంపై జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు కొర్రాయి బాలకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలాసలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని పలాస, ఆమదాలవలస రైల్వేస్టేషన్లకు ప్రయాణికులు, సరుకు రవాణా ఆదాయం వస్తున్నప్పటికీ, సరిపడ మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని దివంగత మాజీ ఎంపీ డాక్టర్ కణితి విశ్వనాథం, బీజేపీ ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు రవిబాబ్జి ఇదివరకు అప్పటి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సోమ వీర్రాజు దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. అలాగే ఈ ఏడాది ఫిబ్రవరి 2వ తేదీన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ దృష్టికి రెండు స్టేషన్ల పరిస్థితి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. దీనిలో భాగంగా పలాసకు రూ.23.50 కోట్లు మంజూరుపై ఆనందంగా ఉందన్నారు. దీంతో ప్రయాణికులకు మేలు జరుగుతుందన్నారు.

పీహెచ్‌సీ ప్రారంభం నేడు

టెక్కలి: మండలంలోని లింగాలవలస పంచాయతీ కేంద్రంలో కొత్తగా మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ప్రారంభించనున్నట్లు సర్పంచ్ సంపతిరావు లక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రస్తుతానికి తాత్కాలిక భవనంలో ఏర్పాటు చేసిన ఈ పీహెచ్‌సీని ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

నవజాత శిశువులకు తల్లిపాలు తప్పనిసరి



చిన్నారులకు అన్నప్రాశన చేస్తున్న దృశ్యం

పలాస: నవజాత శిశువులకు తల్లిపాలు తప్పనిసరిగా పెట్టాలని ఎంపీడీవో ఎన్.రమేష్‌నాయుడు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కాశీబుగ్గ ఐసీడీఎస్ సీడీపీవో డి.శార్వాణి అధ్యక్షతన తల్లిపాల వారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రెంటికోట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సునీల్ బాలింతలు, గర్భిణులకు సూచనలు చేశారు. ఎంఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న న్యూట్రిషన్ ఫుడ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సనూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు లత, సరస్వతి, పి.గంగమ్మ, దానమ్మ, గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

చురుకుగా ఓటర్ల సర్వే



సర్వేను పరిశీలిస్తున్న ఏఈఆర్‌వో పాపారావు

మందస: మండలంలో ఇంటింటా ఓటర్ల సర్వే చురుకుగా సాగుతోంది. అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, తహసీల్దార్ బడే పాపారావు పర్యవేక్షణలో బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నారు. మొత్తం 95 పోలింగ్ బూత్‌లు ఉండగా, 95 మంది బీఎల్‌వోలు పని చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లను బీఎల్వోలుగా నియమించినట్లు ఏఈఆర్‌వో పాపారావు చెప్పారు. గిరిజన గ్రామాలైన కొండలోగాం, పట్టులోగాం, రామరాయి, కుసుమల, జన్నివీధి, టంగరాపుట్టి తదితర గ్రామాల్లో శుక్రవారం ఏఈఆర్‌వో పాపారావు పర్యటించి సిబ్బందికి సూచనలు చేశారు. బీఎల్వోలకు ప్రత్యేక యాప్ ఇవ్వడం జరిగిందని, ఈ యాప్‌లో ఓటర్ల జాబితా సవరణలు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈనెల 21 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఆయనతో పాటు పంచాయతీ కార్యదర్శి ఎస్.శేషగిరి, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ సవర సంజీవి ఉన్నారు.

సంక్షిప్తంగా..

అధునాతన పద్ధతులతో దిగుబడులు



మాట్లాడుతున్న పీడీ కృష్ణారావు

కోటబొమ్మాళి: రైతులు అధునాతన పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చునని ఆత్మా పీడీ కె.కృష్ణారావు అన్నారు. స్థానిక మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో రైతులకు ఆధునిక వ్యవసాయ విధానంపై శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారుల సూచనలు రైతులు పాటించాలన్నారు. అలాగే ప్రభుత్వం 50 శాతం రాయితీపై ఇస్తున్న వ్యవసాయ యంత్రాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టెక్కలి ఏడీ బీవీ తిరుమలరావు, శాస్త్రవేత్త కె.మధుకుమార్, ఏవో ఎస్.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

వజ్రపుకొత్తూరు రూరల్: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని కాశీబుగ్గ రూరల్ సీఐ జి.శంకరరావు అన్నారు. జిల్లావ్యాప్తంగా చేపడుతున్న హెల్మెట్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని బెండి గేట్ జంక్షన్ వద్ద శుక్రవారం ద్విచక్ర వాహనాలను నిలిపి హెల్మెట్ ధరించని వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక ఆస్పత్రికి బెడ్‌షీట్లు

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి రూ.1,29,200 విలువైన 364 బెడ్‌షీట్లను రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం మంజూరు చేసింది. పలాస ఆస్పత్రి పరిశీలనలో భాగంగా ఐటీడీఏ వారు మంజూరు చేశారని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్ తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అగ్గున మేఘన, సిబ్బంది ఆధ్వర్యంలో ఆస్పత్రికి అందించారు.

'మత్స్యకార సదస్సు విజయవంతం చేయండి'

సోంపేట: పట్టణంలోని శైలజ కల్యాణ మండపంలో శనివారం నిర్వహించనున్న మత్స్యకార సదస్సును విజయవంతం చేయాలని ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న సదస్సులో రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ పాల్గొంటారన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల ప్రజా ప్రతినిధులు, మత్స్యకార, అగ్నికుల క్షత్రియ నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కొండ చిలువ హతం



గ్రామస్తులు హతమార్చిన కొండచిలువ

కాశీబుగ్గ: పలాస మండలం రేగులపాడు ఆఫ్‌షోర్ ప్రాజెక్టు వద్ద మేక పిల్లలను మింగేయబోయిన కొండచిలువను స్థానికులు హతమార్చారు. ముందు కొండచిలువ ఓ మేకపిల్లను చుట్టుముట్టి మింగేయడానికి చూసింది. దాన్ని కాపాడేందుకు తల్లి మేక తీవ్రంగా ప్రయత్నించింది. ఆ మేక అరుపులు విన్న కాపరి తిరుపతిరావు విడిపించే ప్రయత్నం చేయగా పాము అతడిపైకి రావడంతో అతడు భయపడి గ్రామానికి పరుగులు తీశాడు. వారంతా వచ్చేసరికి మేక పిల్లను కొండచిలువ చుట్టేసి మింగేస్తుండటంతో సర్పాన్ని హతమార్చారు. ఆ తర్వాత మేక పిల్ల మరణించింది.

యూనివర్సిటీలో పోస్టులు భర్తీ హర్షణీయం

కాశీబుగ్గ: రాష్ట్రంలో ఉన్నత విద్య బలోపేతానికి 3,295 బోధనా సిబ్బంది నియమకాలు చేపట్టడం హర్షణీయమని ఆంధ్ర యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ కో–ఆప్షన్ సభ్యుడు బమ్మిడి సంతోష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత పాలకులు వర్సిటీల నాణ్యతను దెబ్బ తీశారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొత్తగా రెగ్యులర్ పోస్టులు భర్తీ చేయడంతో వర్సిటీ విద్య బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. డీఎస్సీ, గ్రూప్స్ అభ్యర్థుల వయోపరిమితి పెంచాలని కోరారు.